
ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.30 (298.3005)	1,90,042	1,90,042 (18 గేట్ల ఎత్తివేత)
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.65 (4.11)	1,260	1,859
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.814 (38.0890)	2,27,382	1,14,494

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220



ఇక వ్యవసాయశాఖ పల్లెబాట

- నేటి నుంచి పంటల నమోదు ప్రక్రియ
- మూడు జిల్లాల్లో నవంబరు 1లోగా సర్వే పూర్తికి ఏర్పాట్లు
- ఈసారి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీల్లో రైతుల, పంటల వివరాల ప్రదర్శన
- కచ్చితమైన సమాచార సేకరణకు అధికారుల నిర్ణయం
- ప్రతి రైతు సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం

రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పంటల నమోదు ప్రక్రియకు నిర్ణయించింది. ఈ నెల 26 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, నవంబరు 1వ తేదీ నాటికి పూర్తిచేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పంటల నమోదు ప్రక్రియలో భాగంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

వ్యవసాయశాఖ ప్రత్యేక రూపొందించిన డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో ప్రతీ రైతు వివరాలు, పంటల సాగు, పట్టాదారు పాస్‌పుస్తకం నెంబర్, సర్వే నెంబర్లు, సాగు చేసిన విస్తీర్ణం తదితర వివరాలను నమోదుచేస్తారు. ఈ డిజిటల్ క్రాప్ సర్వేలో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కచ్చితమైన వివరాలను నమోదుచేస్తారు. అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూసేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది. ఈ సర్వేలో వ్యవసాయశాఖ రూపొందించిన ఏఈవో యాప్‌తో పాటు డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను ఉపయోగించనున్నారు. ప్రతీ క్లస్టర్‌లో, ప్రతీ రైతును యూనిట్‌గా తీసుకొని వారి వివరాలను అధికారులు నమోదుచేస్తారు. అదేవిధంగా సాగు చేసిన పంటల ఫొటోలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. పంటల వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేయడం ద్వారా కచ్చితత్వం పెరుగుతుందని వ్యవసాయశాఖ అభిప్రాయపడుతోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెల వరకు మొత్తం మూడు నెలలకుపైగా వ్యవసాయ అధికారులు పల్లెబాట పట్టనున్నారు. మూడు జిల్లాలో సాగు విస్తీర్ణంపై సర్వే చేయనున్న అధికారులు సాగుభూమి ఎంత? ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నారు? అని పరిశీలించి వీటిని నమోదుచేస్తారు.

ఉమ్మడి జిల్లాలో 4లక్షలకు పైగా సర్వేనెంబర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 73 మండలాల్లో ఆయా క్లస్టర్ల వారీగా 4,10,729 సర్వే నెంబర్లలో వ్యవసాయ భూములు విస్తరించి ఉన్నాయి. ఈ భూముల్లో ఏ పంటలు సాగుచేశారో అధికారులు యాప్‌లో నమోదు చేస్తారు. నల్లగొండ జిల్లాలో 132 క్లస్టర్లలోని 1,95,957 సర్వే నెంబర్లలో 12,47,562ఎకరాల పంట విస్తీర్ణం ఉంది. సూర్యాపేట జిల్లాలో 1,06,012 సర్వే నెంబర్లలో 6,32,506 ఎకరాల్లో పంటలు విస్తరించి ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 1,08,760 సర్వే నెంబర్లలో 6,07,285 ఎకరాల్లో పంటల విస్తీర్ణం ఉంది. ఈ సర్వే నెంబర్ల ఆధారంగా పంటల విస్తీర్ణాన్ని, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గతంలో సమయం సరిపోక పోవడంతో పంటల నమోదుకు అదనపు గడువును ప్రభుత్వం ఇచ్చింది. ఈ మారు ఏకంగా మూడు నెలలకు పైగా ప్రభుత్వం గడువును కేటాయించింది. ఈ గడువులోగా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంటల నమోదును పూర్తిచేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖ

మిగతా 6వ పేజీలో...

పకడ్బందీగా పంటల నమోదు

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల నమోదు ప్రక్రియను ఈనెల 26 నుంచి నవంబరు 1వ తేదీ వరకు నిర్వహిస్తాం. ఏఈవోలు ప్రతీ గ్రామానికి వెళ్లి, ప్రతీ సర్వేనెంబర్‌లో పంటల, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వ్యవసాయ అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు వారికి సహకరించి పంటల, ఇతర వివరాలను అందజేయాలి. ఈ నివేదికను పూర్తిస్థాయిలో నవంబరు మొదటి వారంలో ప్రభుత్వానికి అందజేస్తాం. ప్రతి వ్యవసాయ అధికారి గ్రామాలను సందర్శిస్తారు.

పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

పేదలకు అధునాతన వైద్య సౌకర్యాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ల్యాప్రోస్కోపిక్ ద్వారా పలు శస్త్ర చికిత్సలు : డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు అధునాతన వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లాలో వైద్యరంగాన్ని పటిష్ఠం చేస్తున్నట్టు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన లాప్రోస్కోపిక్ యూనిట్‌ను పద్మ విభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రపంచంలోనే గర్వించదగ్గ వైద్యుడు నాగేశ్వర్‌రెడ్డి ఈ ఆధునాతన లాప్రోస్కోపిక్ యూనిట్ ప్రారంభించడం సంతోషకర విషయమన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నానని, ఏడాదిలోపే ప్రభుత్వ వైద్యకళాశాలను నిర్మించామని, రూ.40కోట్లతో నర్సింగ్ కళాశాలను సైతం నిర్మిస్తున్నామన్నారు. శస్త్రచికిత్సలను ఇక్కడే నిర్వహించేలా, పేదలకు మేలు చేసేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో లాప్రోస్కోపిక్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికల్ విద్య పూర్తి చేసిన విద్యార్థులకు హైదారాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జీజీహెచ్‌కు వెళ్లేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, జీవితంలో అందరికీ అవకాశాలు వస్తాయని, వాటిని అందిపుచ్చుకున్న వారే ముందుకు వెళ్తారని తెలిపారు. నల్లగొండ వైద్యశాల కళాశాల విద్యార్థులు ఏఐజీ ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తామని, అదేవిధంగా ఇక్కడి వైద్య కళాశాలను దత్తత తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్యాస్ ఎంట్రాలజిస్ట్ డాక్టర్ జీవీ.రావు, సామాజిక కార్యకర్త ఎస్పీ.రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వైటీపీఎస్‌లో ఉద్యోగాలు కల్పించాలి



ఆందోళన నిర్వహిస్తున్న వీర్లపాలెం గ్రామస్థులు

వీర్లపాలెం గ్రామస్థుల ఆందోళన

దామరచర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్లపాలెం శివారులోని యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వీర్లపాలెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు గ్రామంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, పవర్ ప్లాంట్ ఏర్పాటు సమయంలో గ్రామంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులతోపాటు గ్రామస్థులకు కూడా ఇంటికి ఒక ఉద్యోగం లేదా రూ.5లక్షల పరిహారం అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించినా, స్థానికుల గురించి పట్టించుకోవడంలేదని వాపోయారు. పవర్ ప్లాంట్‌లో సాగు భూములు పోవడంతో, వాటిని నమ్ముకొని కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న గ్రామస్థులు, రైతు కూలీలు ప్రస్తుతం పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. థర్మల్ ప్లాంట్ నుంచి వచ్చే కాలుష్య ప్రభావం గ్రామంపై అధికంగా ఉంటుందని, గ్రామానికి నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో గ్రామస్థులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా జీవో 98 ప్రకారం 2వేల ఉద్యోగాలు స్థానికులకు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రైల్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని భువగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం ఈ మేరకు సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ్‌ను హైదరాబాద్‌లో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఘట్కేసర్ నుంచి యాదాద్రికి ఎంఎంటీఎస్ రైలు భూసేకరణ అంశంపై మేడ్చల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భువనగిరి నుంచి రాయిగిరి వరకు ఎంఎంటీఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రామన్నపేటలో ఫలక్‌నామా, శబరి, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే అసిస్టెంట్ జీఎం ఉదయ్‌నాథ్‌కోట్ల, ఎంఎంటీఎస్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ సాయిప్రసాద్, పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి : డీఎల్‌పీవో



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్

డిండి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలకు గ్రామపంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ తెలిపారు. తవక్లాపూర్ గ్రామంలో గృహ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో ఆయన సోమవారం విచారణ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, అనుమతులులేకుండా నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. పాత ఇళ్లను కూల్చి నూతన నిర్మాణం చేపట్టాలన్నా తప్పనిసరిగా గ్రామపంచాయతీ అనుమతి తీసుకోవాలన్నారు. పంచాయతీ రికార్డులో ఇంటి వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నిర్మూలనకు సాయంత్రం సమయంలో ఫాకింగ్ చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జంగయ్య ఉన్నారు.

ఇళ్ల నిర్మాణంలో సమస్యలు లేకుండా చూడాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, సామగ్రి విషయాల్లో ఇబ్బందులు కలగకుండా గృహనిర్మాణశాఖ పీడీ చొరవ తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇసుక ట్యాక్స్‌ను పంచాయతీరాజ్‌శాఖ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 1,000మెట్రిక్ టన్నుల ఇసుకను ఇచ్చేందుకు, మూసీ పూర్తిస్థాయిలో ప్రవహిస్తున్నందున పరివాహక ప్రాంతంలో అందుబాటులో నదీ తీరప్రాంతం నుంచి ఇసుకను తీసేందుకు తీర్మానించిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మెన్స్‌శాఖ సహాయ సంచాలకుడు జాకబ్, డీపీవో వెంకయ్య, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, గ్రౌండ్ వాటర్ డీడీ రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్ శాంతకుమారి, టీజీఎండీసీ పీవో మధు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కలెక్టరేట్): 'ప్రజావాణి'లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం 'ప్రజావాణి'లో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. పలు సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు కారణాలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. కాగా 'ప్రజావాణి'లో మొత్తం 80 ఫిర్యాదులు రాగా, వాటిలో రెవెన్యూశాఖకు చెందినవి 50, ఇతర శాఖలకు చెందినవి 35 ఉన్నాయి. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి): తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ, ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థినులకు చాక్‌లెట్లు పంపిణీచేశారు. కష్టపడి, ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి వైద్యుల హాజరు, తదితర రిజిస్టర్లను తనిఖీచేశారు. ఆమె వెంట తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు నిడమనూరు పోలీస్‌స్టేషన్ ప్రారంభం



నిడమనూరు పోలీస్‌స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ సురేష్, స్టేషన్ సిబ్బంది

నిడమనూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ భవనంలో ఏర్పాటు చేసిన నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభమైంది. స్టేషన్‌ను ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ద్వారా ప్రారంభింపజేయాలని ప్రయత్నించినా ఈ కార్యక్రమం ఐదుమార్లు వాయిదా పడింది. దీంతో ఎట్టకేలకు ఉన్నతాధికారులు లేకుండానే సోమవారం పూజలు నిర్వహించి స్టేషన్‌ను ఎస్ఐ ఉప్పు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తామని, విధి నిర్వహణలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌సీలు వెంకటేశ్వర్లు, కుంచం యాదగిరి, సిబ్బంది శేఖర్, సత్యం, రమేష్, నగేష్, హనుమా, నరెందర్, హనుమంతరావు, రామాంజనేయులు, మహేష్, కిరణ్, శ్రీకాంత్, మానస, అప్పారావు పాల్గొన్నారు.

కాగా, గతంలో ఉన్న పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించి మూడు దశాబ్దాలవడం, శిథిలమై పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో భద్రత దృష్ట్యా మండల పరిషత్ భవనంలోకి స్టేషన్‌ను తరలించారు. ఆ భవనంలో అవసరమైన మరమ్మతులు చేయించారు. మండల పరిషత్ భవనాన్ని పోలీస్‌స్టేషన్‌కు వినియోగిస్తున్నందునకు నెలకు రూ.11,312 అద్దె చెల్లించనున్నారు.

పడిగాపులు కాసినా..

● యూరియా కోసం అంతటా రైతుల కష్టాలు

7



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీజీఈజేఏసీ, టీఎన్‌జీవోస్ నాయకులు

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

నల్లగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో టీజీఈజేఏసీ, టీఎన్‌జీవోల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంతో పాటు, 17న ఉద్యోగుల చైతన్య సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సెప్టెంబరు 8 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి, ఎం.శ్రీనివాస్, జె.శేఖర్‌రెడ్డి, రామలింగం, ఎన్.శేఖర్‌రెడ్డి, నర్సింహాచారి, వెంకటేశ్వర్లు, అలీం, వెంకులు, మోహన్‌రావు, భిక్షమయ్య, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు రూ.18వేలు వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.18వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాల చట్టం ప్రకారం రూ.26వేలు ఇవ్వాల్సి ఉండగా, రూ.9,500 మాత్రమే ఇస్తూ శ్రమను ప్రభుత్వాలే దోపిడీ చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేసి ర్యాలీగా డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరి, వెంకటమ్మ, అవుట రవీందర్, సత్యనారాయణ, సుధీర్, సైదులు, వసంత, స్వర్ణ, జ్యోతి, వెంకటమ్మ, అనూష, పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలి



ఇటలీ ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న పాఠశాల విద్యార్థులు

నాగార్జునసాగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఇటలీకి చెందిన జేఎంజే సొసైటీ సభ్యులు తెలిపారు. సోమవారం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో జేఎంజే సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలను ఇటలీ నుంచి వచ్చిన సభ్యులు సిస్టర్ మేరీ, సిస్టర్ థ్రీజ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో పలు రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలో అమలుచేస్తున్న విద్యా ప్రణాళికలను, క్రమశిక్షణను కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ లలిత, సిస్టర్ మతీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హన్యానాయక్‌కు గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు



మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సోషల్ వర్కర్, ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్ గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. యూఏఈకి చెందిన జెడ్ స్క్వేర్ యూనివర్సల్ డ్రీమ్ మేకర్స్ సంస్థ అందించే గ్లోబల్ ఎక్సలెన్సీ అవార్డులలో భాగంగా సోషల్ వర్క్, ఎడ్యుకేషన్ విభాగానికి హన్యానాయక్‌ను ఎంపిక చేసింది. ఢిల్లీలో జరిగిన 5వ బిజినెస్ సమ్మిట్‌లో సంస్థ ప్రతినిధులు హన్యానాయక్‌ను అవార్డు, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా హన్యానాయక్ విలేకరులతో మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను పెంచిందన్నారు. కాగా అవార్డు అందుకున్న హన్యానాయక్‌కు స్వచ్ఛంద సంస్థల సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి అక్రమాలకు ఈకేవైసీతో చెక్

● ఉదయం, సాయంత్ర కూలీల ఫొటోలు ఆన్‌లైన్‌లో..

● సరిపోలితేనే కూలి డబ్బులు

ఉపాధిహామీలో క్షేత్రస్థాయి సిబ్బంది అవినీతి, అక్రమాలకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) యాప్‌ను తీసుకువచ్చింది. వలసలు నివారించేందుకు తీసుకువచ్చిన ఉపాధిహామీ పథకం అక్రమాలకు కేంద్రంగా మారడం, సోషల్ ఆడిట్‌లో రూ.కోట్లలో అక్రమాలు బహిర్గతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కేవైసీ విధానం అక్రమాలకు చెక్‌పెడుతుందని భావిస్తున్నారు. పనికి హాజరైన కూలీల ఉదయం, సాయంత్రం ఫొటోలు సమానంగా ఉంటేనే వేతనాలు అందనున్నాయి. దీంతో అక్రమాలు నిలిచిపోనున్నాయి.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు 100 రోజులు పనికల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో కూలీలకు పని కల్పించేందుకు ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో అనేక రకాల పనులు చేపడుతున్నారు. ఈ పనులకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. అయితే క్షేత్రస్థాయి సిబ్బంది వారికి ఉన్న అవకాశాలను అక్రమార్జనకు ఉపయోగించుకుంటున్నారు. వారి చేతివాటం ప్రతీ సోషల్‌ఆడిట్‌లో బహిర్గతమవుతోంది. నిధుల నుంచి రూ.లక్షల్లో కాజేస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్ యాప్‌తో చెక్

సూర్యాపేట జిల్లాలో 2.63 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటిలో నమోదైన కూలీలు మొత్తం 5.7లక్షలు కాగా పనులకు వెళ్తున్న కూలీలు 2.15లక్షల మంది ఉన్నారు. అయితే ఉపాధి పనులకు వస్తున్న కూలీలు హాజరులో అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తిస్తున్నారు. ముఖ్యంగా జాబ్‌కార్డులో ఒకరు కూలీకి వచ్చే వారు ఒకరు ఉన్నట్లు గుర్తించారు. దీంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్(ఎన్ఎంఎంఎస్) తీసుకువచ్చారు. ఈయాప్ ద్వారా ఈ కేవైసీ చేస్తున్నారు. ముఖ్యంగా కూలికి వచ్చిన వ్యక్తి ఉదయం ఫొటో తీసుకోవడంతో పాటు సాయంత్రం తిరిగి అదే కూలీ ఫొటో మరోసారి నమోదు చేయాలి. ఉదయం, సాయంత్రానికి సంబంధించిన కూలీ ఫొటో సమానంగా ఉంటేనే ఉపాధి వేతనాలు అందుతాయి.

సోషల్ ఆడిట్‌లో అక్రమాలు వెలుగులోకి..

ఉపాధిహామీ పథకానికి సంబంధించిన వాస్తవాలు సోషల్‌ఆడిట్‌లో వెలుగు చూస్తున్నాయి. ఈ పథకంలో ఎక్కువగా ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడుతున్నారు. గ్రామాల్లో పనులు చేయకుండా, కూలీలు పనికి రాకున్నా అక్కడ పనులు జరిగినట్లు కూలీలకు కూలీ చెల్లించినట్లు తప్పుడు రికార్డులు నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా చేసిన పనుల్లో కూడా రికార్డుల్లో నమోదు చేసే సమయంలో కొలతలను కూలీల సంఖ్యను తప్పుగా నమోదు చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలు గ్రామాల్లో నిర్వహించే సోషల్ ఆడిట్లలో వెలుగుచూస్తున్నాయి. సూర్యాపేట జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు అన్ని గ్రామపంచాయతీల్లో సోషల్ ఆడిట్ పూర్తిచేశారు. కానీ వారి నుంచి అవినీతి సొమ్మును రికవరీ చేయలేకపోయారు. గతంలో జరిగిన అవినీతి విషయంలో బాధ్యుల నుంచి కొంత మొత్తంలో అధికారులు సొమ్ము రికవరీ చేయగలిగారు.

అవినీతికి పాల్పడినా తిరిగి ఉద్యోగంలోకి

ఉపాధిహామీ పథకంలో అవినీతికి పాల్పడి విధుల నుంచి తొలగించబడిన సిబ్బంది తిరిగి కొన్నాళ్లకు ఉద్యోగంలో చేరుతున్నారు. స్థానిక నాయకులు, అధికారులకు అవినీతికి పాల్పడిన వారిపై ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా వారిని తొలగించడడం లేదు. అవినీతికి పాల్పడిన సిబ్బంది ఆ సొమ్మును తిరిగి చెల్లించి విధులకు హాజరవుతున్నారు.

అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు

ఎన్ఎంఎంఎస్ యాప్‌తో పాటు ఈకేవైసీ విధానంలో కూలీల ఫొటోలు ఖచ్చితంగా నమోదుచేస్తాం. దీంతో అవినీతికి ఆస్కారం ఉండదు. ఉపాధిహామీ పేరుతో ప్రతి కూలీకి పనులు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ, సూర్యాపేట జిల్లా

వ్యాన్ డ్రైవర్ ఆత్మహత్యా యత్నం

మోత్కూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణానికి చెందిన ఎడ్ల గణేష్ సోమవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. భారత్ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ వద్ద వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న గణేష్ ఈ నెల 1 నుంచి కాంట్రాక్టర్ మారిపోవడంతో పనికి వెళ్లడం లేదని తెలిసింది. సోమవారం మోత్కూరు పట్టణ శివారులో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో వెళ్లగా స్థానికులు గమనించారు. అతడిని 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పైలెట్ సోమేష్, ఈఎంటీ మహేష్ తెలిపారు. గణేష్ ఆత్మహత్య యత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

» సకల వర్ణం ఆకాశం...



నల్లగొండ సమీపంలో దండెంపల్లిలో సోమవారం సాయంత్రం ఆకాశం వివిధ వర్ణాలతో కనిపించింది. నెలవంకతో కూడిన ఆకాశాన్ని ఆసక్తిగా తిలకించారు.

బలవంతపు చందాలు నేరం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గణేష్ ఉత్సవాల సందర్భంగా బలవంతపు చందాలు వసూళ్లు చేయడం చట్టపరంగా నేరం. స్వచ్ఛంద విరాళాలపై ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. విగ్రహ మండపాల ఏర్పాటు వివరాలను పోలీస్‌స్టేషన్లలో తెలియపర్చాలి. మండపాల రక్షణ కోసం పోలీస్ నిఘా ఉంటుంది. నిమజ్జనానికి చిన్నపిల్లలను అనుమతించొద్దు. పోలీస్ శాఖ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. ప్రశాంతంగా నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ..

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

ఆంధ్రజ్యోతి: గణేష్ చందాల వసూళ్ల నియంత్రణ ఉంటుందా?

ఏసీపీ : వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వ్యాపారులు, ఇతర వర్గాల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం చట్టపరంగా నేరంగా పరిగణిస్తాం. అదేక్రమంలో స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వడం దాతృత్వం కిందకు వస్తుంది. గణేష్ మండపాలను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా ఏర్పాటుచేసుకోవాలి. ప్రశాంతంగా వేడుకలు జరిగేందుకు పోలీస్ శాఖకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: మండపాల వద్ద మైక్ సెట్లు ఎలాంటివి ఉపయోగించాలి ?

ఏసీపీ: సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి లౌడ్ స్పీకర్లు రాత్రి 10 గంటలకు నిలిపివేయాలి. అవి కూడా సాధారణ మైక్‌సెట్‌లను మాత్రమే వినియోగించాలి. వాటి శబ్దాలతో ప్రజలకు అసౌకర్యం కలగకూడదు. మైక్‌ల ఏర్పాటుకు పోలీస్ అనుమతి పొందాలి. డీజే సౌండ్ సిస్టమ్ పూర్తిగా నిషేధం. డీజేలను వాడితే కేసులు నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: విద్యుత్ సరఫరాకు అనుమతి తీసుకోవాలా?

ఏసీపీ: మండపాల వద్ద లైటింగ్ కోసం టీఎస్ ట్రాన్స్‌కో నుంచి ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. షార్ట్‌సర్క్యూట్ జరుగకుండా నాణ్యత కలిగిన వైరింగ్‌ను వినియోగించాలి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు మండపం వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలి. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చూసుకోవాలి. అపరిచిత వ్యక్తుల కదలికలతో పాటు ప్రజలకు అసౌకర్యం కలిగించే విషయాలపై పోలీస్‌లకు లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: మండపాల నిర్మాణాలపై సూచనలు ఏమిటీ?

ఏసీపీ: గణేష్ ప్రతిమలను ప్రతిష్ఠించే వేదికలను పటిష్ఠంగా నిర్మించాలి. దానిపై నాణ్యత గల షెడ్‌లను ఏర్పాటుచేయాలి. లోపలికి వర్షపు నీరు రాకుండా పకడ్బందీగా చేపట్టాలి. మండపంలోనికి మూగజీవాలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నూనె దీపాలతో అగ్ని ప్రమాదాలు జరగకుండ చూడాలి. ఒక వేళ అగ్ని ప్రమాదాలు జరిగితే నివారించేందుకు రెండు బకెట్ల నీళ్లు, రెండు బకెట్ల ఇసుకను అందుబాటులో ఉంచాలి. పర్యావరణాన్ని కాపాడేలా మట్టి గణపతి విగ్రహాలను వాడితే మంచిది. పూజలకు వచ్చే మహిళలు, యువతులపై ఈవ్ టీజింగ్ జరుగకుండా చూడాలి. ఉత్సవాలలో టపాస్‌ల వినియోగం నిషేధం.

బంగారునాణేల కథలల్లి, డబ్బులు కాజేసి..

చివ్వెంల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పురాతన బంగారు నాణేలు ఇస్తామని నమ్మించి రూ.20 లక్షలు మోసపూరితంగా తీసుకున్న నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. దురాజ్‌పల్లికి చెందిన వ్యాపారస్తుడు నిమ్మనగోటి వెంకటేశ్వర్లును పురాతన బంగారు నాణేలు ఉన్నాయంటూ పలువురు సంప్రదించారు. పురాతన కుండలో బంగారునాణేలు లభించాయని వీడియో చూపించి రూ.20 లక్షలు ఇస్తే ఇస్తామని నమ్మబలికారు. ఈ క్రమంలో అతడి నుంచి ఈ నెల 10వ తేదీన రెండు కోళ్లను కోసి వాటి రక్తంతో గాయాలున్న వీడియో తీసి బాధితుడికి పంపి రూ.20 లక్షలు వసూలు చేశారని డీఎస్పీ చెప్పారు. ఆ సమయంలో రెండు నకిలీ బంగారు నాణేలు ఇచ్చి నమ్మించారన్నారు. అనంతరం మరోసారి ఆయన్ను భయపెడుతూ రూ.10 వేలు తీసుకున్నారన్నారు. వెంకటేశ్వర్లు తాను తీసుకున్న నాణేలను తెలిసిన వారిచేత పరీక్షించగా నకిలీవని తేలింది. దీంతో ఆయన పోలీసులను సంప్రదించారని డీఎస్పీ తెలిపారు. విచారణలో భాగంగా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన పసుపుల గణేష్, ఓర్సు చంటి, ముద్దంగుల వెంకన్న, పసుపుల సత్యంతో పాటు పసుపుల నవీన్, ఓర్సు శ్రీను, ఓర్సు గోపమ్మ, పసుపుల లక్ష్మి, ముద్దంగుల అంజలి ఈ ఉదంతంలో ఉన్నారని గుర్తించామన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పసుపుల గణేష్, ఓర్సు చంటి, ముద్దంగుల వెంకన్న, పసుపుల సత్యంలను సూర్యాపేట ఉండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అదేవిధంగా వారి నుంచి రూ.13.25 లక్షలు రికవరీ చేశామన్నారు. మిగతా ఐదుగురు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా పురాతన నాణేలు ఉన్నాయని సంప్రదిస్తే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

మేకల దొంగల ముఠా అరెస్ట్

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల దొంగతనాలు

కట్టంగూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామశివారులో రాత్రి వేళల్లో మేకల చోరీలకు పాల్పడుతున్న నలుగురు ముఠాను అరెస్టు చేసినట్లు నల్లగొండ జిల్లా కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తెలిపారు. వారి నుంచి రూ.30వేల నగదు, ఆరు మేకలు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం పోలీస్టేషన్‌లో విలేకర్లకు వెల్లడించారు. కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మేకల చోరీలకు పాల్పడిన విషయం వెల్లడైందన్నారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన కాంపాటి అజయ్‌కుమార్, కాంపాటి హుస్సేన్, మట్టి సురేష్, కొడి వంశీలు కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ డ్రైవింగ్‌తో పాటు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నారని తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగాలతో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు మేకల దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. జూలై నెలలో కట్టంగూరు మండలం చెర్వుఅన్నారంలో మూడు మేకలు, పరడలో నాలుగు మేకలను చోరీ చేశారని ఇదే తరహాలో సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో రెండు చోట్ల, నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోట చోరీలకు పాల్పడ్డారని వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కట్టంగూరు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్



మిథున్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళ గంజాయి రవాణా చేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని సోమవారం యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇదే ఘటనలో మరో ఇద్దరు పరారయ్యారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం తెల్లవారుజామున పోచంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, హెచ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ సాయికుమార్, డ్రైవర్ వెంకటేశం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఉదయం ఏడు గంటల సమయంలో అయ్యప్పగుడి వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా ఉండడంతో వివరాలు అడిగారు. సరైన సమాధానం చెప్పకపోగా, అతడి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేశారు. అందులో 120 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే స్టేషన్‌కు తరలించి విచారించారు. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని గాంధీనగర్‌లో ఉంటున్న బిహార్ రాష్ట్రం బారాహితోల సుఖసాని గ్రామానికి చెందిన తంటి మిధున్ కుమార్(33)గా గుర్తించారు. స్థానికంగా సెంట్రింగ్ వర్క్ పనులు చేస్తున్నాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇక వ్యవసాయశాఖ పల్లెబాట

(5వ పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ప్రతీ రైతు సమాచారాన్ని నిక్షిప్తం చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా మూడు జిల్లాలో నవంబరు 1వ తేదీ లోగా పూర్తిచేసి నవంబరు 3న గ్రామపంచాయతీల్లో రైతుల పేర్లు, వారి పంటల వివరాలను ప్రదర్శిస్తారు. 8న రైతుల నుంచి అభ్యంతరాలు తీసుకుంటారు. నవంబరు 11న అభ్యంతరాలను పరిశీలించి 13వ తేదీన ఫైనల్ చేసి డేటాను పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి నివేదిస్తారు.

పంటల విక్రయ సమయంలో..

పంటల దిగుబడి వచ్చే నాటికి సర్వే నెంబర్ల వారీగా వివరాల నమోదును పూర్తిచేస్తే రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందనేది ప్రభుత్వ ఆలోచన. ఏ మేరకు పంటల దిగుబడు వస్తాయి? అందుకు ఎన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలనే దానిపైనా అధికారులు సర్వే చేయనున్నారు. దీంతో పాటు రైతుబంధు, రైతుబీమా, పంట రుణాల వంటి సమస్యలు కూడా రైతుల సమగ్ర వివరాలతో తొలిగే అవకాశం ఉంది. అదేవిధంగా పంటల కొనుగోలు సమయంలో రైతులు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేయాలి? ధాన్యం కొనుగోలుకు ఎన్ని ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే దానిపై అధికారులు ఓ అంచనాకు వస్తారు. వానాకాలంలో ప్రధానంగా వరి, ఆ తరువాత పత్తినే రైతులు అధికంగా సాగుచేశారు. గతంలో పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని, అధికారులు ఆ గ్రామంలో 400 నుంచి 500 ఎకరాల వరకు పంటల వివరాల నమోదు ఎలా ఉందనే విషయాన్ని పరిశీలించేవారు. ఈ విధానంతో అంతగా ప్రయోజనం లేదని భావించిన ప్రభుత్వం ప్రతీ సర్వే నెంబర్‌ను అధికారులు చూసిన తరువాతే వివరాల నమోదు అంటూ వ్యవసాయశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. గతంలో 400 నుంచి 500 ఎకరాల్లో ఏ ఒక్క సర్వే నెంబర్ కూడా బ్రేక్ చేయకుండా సర్వే చేయగా, ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా పూర్తి స్థాయిలో అన్ని సర్వే నెంబర్లను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ఈ వివరాలు సమగ్రంగా ఉంటే వచ్చే యాసంగికి, ఆ తరువాత వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు మొదలు ఎరువులు, రుణాలు, రైతు భరోసా పకడ్బందీగా అమలుచేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ వానాకాలం సర్వేను సమగ్రంగా చేపట్టనున్నారు. అదేవిధంగా కొంతమంది దళారులు, వ్యాపారులు రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులు తీసుకొని దొడ్డిదారిన పత్తి, ధాన్యాన్ని విక్రయించకుండా చెక్ పెట్టేందుకు రైతుల సమగ్ర సర్వే ఉపయోగపడనుంది. కేవలం రైతులు ఇచ్చిన వివరాల ప్రకారం, వారి పంట దిగుబడులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసి దళారులను నిలువరించనుంది.

తాళం వేసిన ఇళ్లలో చోరీలు

మునుగోడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మునుగోడులో ఆదివారం రాత్రి తాళం వేసిన ఇళ్లలో చోరీ జరిగింది. కమ్మగూడెంలో బొంత లింగస్వామి తనఇంట్లోనే ఆటో మెకానిక్‌షాపు నిర్వహిస్తున్నాడు. అనారోగ్యానికి గురైన బంధువును చూసేందుకు కుటుంబీకులతో కలిసి 24న ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తీసి, తాళం పగిలి ఉండటం చూసిన స్థానికులు ఆయనకు సమాచారం అందించారు. అదేవిధంగా లింగస్వామి ఇంటిపక్కన తాళం వేసి ఉన్న కొంక పాతిమ అనే ఒంటరి మహిళ ఇంట్లో సైతం చోరీకి పాల్పడ్డారు. అయితే ఏమీ పోలేదు. లింగస్వామి సాయంత్రం వచ్చి చూడగా కొంత నగదుతో పాటు వివిధ బంగారు నగలను దొంగలు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ రవి చోరీ జరిగిన ఇళ్లను సందర్శించారు.

కన్నులవిందుగా క్రీడాకారుల పండుగ

● భువనగిరిలో టెన్నిస్ టోర్నమెంట్ ● 180మంది ఆటగాళ్ల రాక



అకాడమీలో టెన్నిస్ పోటీల సందర్భంగా ఆడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



● క్రికెట్ బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో విద్యార్థులు





● స్కేటింగ్ ప్రాక్టీస్‌లో విద్యార్థులు

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ప్రతిష్ఠాత్మక [illegible] స్మారక ఐటీఎఫ్-జే60 టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలోని [illegible] టెన్నిస్ అకాడమీలో ప్రారంభమైంది. అమెరికా, దక్షిణకొరియా, ఫ్రాన్స్ వంటి దేశాల నుంచి 180మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థుల ప్రదర్శన అందరినీ అలరించింది.



కరాటే ప్రాక్టీస్‌లో విద్యార్థిని..

● (ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్-యాదాద్రి)

పడిగాపులు కాసినా..

● యూరియా కోసం రైతుల కష్టాలు ● క్యూలైన్‌లో చెప్పులు, పాస్‌పుస్తకాలు ● రోజంతా క్యూలైన్లో నిలబడినా నిరాశే



నల్లగొండ జిల్లా కనగల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల దుకాణాలు, సొసైటీ చుట్టూ తిరుగుతున్నా ఒక్క బస్తా కూడా అందకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రోజంతా క్యూలైన్‌లో నిలబడి ఓపిక నశించి ఆగ్రహంతో రోడ్డెక్కుతున్నారు.

నిడమనూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలకేంద్రంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. యూరియా లోడ్ వస్తుందని చెప్పడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో సోమవారం సొసైటీ వద్దకు వచ్చారు. యూరియా లోడ్ రాలేదని, పక్క సొసైటీకి పంపించారని తెలియడంతో ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారిపై బైఠాయించారు. రైతుల ఆందోళనకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఆందోళనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఉప్పు సురేష్ సిబ్బందితో వచ్చి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఏవో మునికృష్ణయ్య కూడా అక్కడికి రావడంతో రైతులు అధికారులతో వాదనకు దిగారు. యూరియా కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. ఎరువుల దుకాణదారులు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. మండలంలోని ముకుందాపురంలో 220 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, అక్కడికి వెళ్లి తెచ్చుకోవాలని ఏవో రైతులకు సూచించారు. యూరియా అవసరాల గురించి ఉన్నతాధికారులతో మాట్లాడామని మంగళవారం లోడ్ వస్తున్నందున రైతులకు సక్రమంగా పంపిణీ చేస్తామని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, వింజమూరి శివ, బీజేపీ నాయకుడు కోటేశ్వర్‌రెడ్డి, రైతులు బిజిలీ అశోక్, చేగొండి శంకర్, వెంకన్న, అంజయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతులకు యూరియా సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందించారు.

క్యూలో చెప్పులు పెట్టి నిరీక్షణ

అనంతగిరి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం కేంద్రంలో తెల్లవారుజామునే లేచి సహకార సంఘాల వద్ద క్యూలైన్‌లో గంటల తరబడి వెచిఉన్నారు. ఓపిక నశించి చెప్పులు లైన్లో ఉంచారు. ఎరువుల కోసం ఇక్కడే ఉండడంతో ఇతర పనులు పనులు ఆగిపోతున్నాయ రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. క్యూలో ఉన్నా సరిపడా యూరియా అందే పరిస్థితి లేదని రైతులు తెలిపారు.

రైతులకు తప్పని అగచాట్లు



కేతేపల్లిలో చెప్పుల వరుస ఉంచిన రైతులు

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి పీఏసీఎస్‌లో 540బస్తాల యూరియా దిగుమతి అయింది. విషయం తెలిసిన మండలంలోని వివిధ గ్రామాల రైతులు సోమవారం ఉదయాన్నే కేతేపల్లికి చేరుకుని యూరియా కోసం పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూ కట్టారు. క్యూలైన్లో రైతుల మధ్య తోపులాట జరగడంతో పీఏసీఎస్ సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి రైతుల ఆధార్ కార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలు వరుసలో పెట్టాలని సూచించారు. దీంతో పలువురు రైతులు తమ ఆధార్‌కుర్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టగా మరికొందరు చెప్పులను క్యూలో పెట్టారు. క్యూలైన్లోని ఆధార్ కార్డులు, పాసు పుస్తకాలు, చెప్పుల ఆధారంగా ఒక్కో పుస్తకానికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. దిగుమతి అయిన బస్తాల కన్నా రైతులు అధికంగా ఉండడంతో లైను చివరలో ఉన్న రైతులకు యూరియా అందనేలేదు. దీంతో రోజంతా క్యూలైన్లో నిలబడినా యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు.



రైతులను క్యూలో ఉంచుతున్న పోలీసులు

పోలీసుల పర్యవేక్షణలో..

కట్టంగూరు: నల్లగొండ జిల్లా కట్టంగూరులోని పీఏసీఎస్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు పీఏసీఎస్ వద్దకు వచ్చి రైతులను క్యూలైన్‌లో ఉంచి యూరియాను సరఫరా చేయించారు. పీఏసీఎస్‌ఎకు 443 యూరియా బస్తాలు వచ్చాయి. రైతులకు ఉన్న వ్యవసాయం ఆధారంగా ఒక్కొక్క రైతుకు రెండు నుంచి నాలుగు యూరియా బస్తాలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రవీందర్, ఏవో గిరి ప్రసాద్, సీఈవో బండ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిడమనూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం : బీఆర్ఎస్

పెద్దఅడిశర్లపల్లి: రైతులకు యూరియా అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యోల్గురి వల్లపురెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్వపల్లి నర్సింహ, బొడ్డుపల్లి మహేందర్, మునగాల అంజిరెడ్డి, సుధాకర్‌గౌడ్, ఎర్ర యాదగిరి, రాయనబోయిన శ్రీను, దేపావత్ నరేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట పొలాలను రక్షించాలి : సీపీఎం

నల్లగొండ రూరల్: రైతాంగానికి అవసరమైన యూరియాను అందించి పంట పొలాలను రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నల్లగొండ మండల వ్యవసాయ అధికారి కార్యలయం ఎదుట నిరసన తెలిపారు. నెల రోజులుగా నాట్లు వేసిన రైతులు యూరియా దొరక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నలుపరాజు సైదులు, నాయకులు పోలే సత్యనారాయణ, కొండ వెంకన్న, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు: యూరియా సరఫరా చేయకుండా కొరత సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్లెపు అడవయ్య, పట్టణ కార్యదర్శి బేజాడికుమార్ ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమొక్రసీ ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఆర్. జనార్థన్, మామిడాల సోమయ్య, రాజయ్య, రాఘవరెడ్డి, బర్మబాబు, సహదేవ్, శ్రీనివాస్, సుదర్శన్, కొమరయ్య, బాలమల్లేష్, గోపాల్‌రెడ్డి, స్వామి, సత్యనారాయణ, మార్కండయ, గాడ యాదగిరి, రాములు పాల్గొన్నారు.

రాస్తారోకో

కనగల్: నల్లగొండ జిల్లా కనగల్‌లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. పీఏసీఎస్‌కు యూరియా లోడ్ వచ్చిందని పుకారు వ్యాపించగా రైతులు పెద్ద సంఖ్యలో పీఏసీఎస్ కేంద్రానికి చేరుకున్నారు. యూరియా కోసం తమ పట్టా పుస్తకాలను క్యూలైన్లో పెట్టి కార్యాలయ సిబ్బంది వచ్చే వరకూ ఎదురు చూశారు. తొమ్మిది గంటల సమయంలో పీఏసీఎస్ కేంద్రానికి సిబ్బంది చేరుకుని యూరియా లోడ్ ఇంకా రాలేదని సమయం పడుతుందని రైతులకు చెప్పారు. దీంతో రైతులు ఆగ్రహంతో చేస్తూ కనగల్ ఎక్స్‌రోడ్డుకు చేరుకుని అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. గంటల తరబడి క్యూలో ఉన్నా యూరియా బస్తాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవో అమరేందర్‌గౌడ్, పోలీసులు రైతులకు సర్దిచెప్పి రాస్తారోకోను విరమింపజేయించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో 400 బస్తాల యూరియా లోడ్ పీఏసీఎస్‌కు రాగా ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి : ఎమ్మెల్యే పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

కోదాడరూరల్: ఎరువుల కొరత లేకుండా చూడాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కోదాడ డివిజన్ పరిధిలో వరినాట్లు పూర్తి అయినందున యూరియా ఎక్కువ అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన యూరియా కోట సక్రమంగా విడుదల కాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే వ్యవసాయాధికారులు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కోదాడ, చిలుకూరు, నడిగూడెం, మునగాల, అనంతగిరి మండలాల్లో యూరియా కొరతను నివారించేందుకు వ్యవసాయాధికారులు జిల్లా అధికారులను సంప్రదించి యూరియా సహకార సంఘాలకు అందించేందుకు కృషిచేయాలన్నారు.



నల్లగొండలో ఎరువుల దుకాణం వద్ద క్యూలో ఉన్న రైతులు



మిర్యాలగూడలో ఎరువుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

అసమర్థ పాలనతోనే యూరియా కొరత

కేతేపల్లి: ప్రభుత్వ అసమర్థ పాలనతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న యూరియా కొరతతో రైతులు క్యూలో నిలబడి తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. యూరియా ఎంత అవసరమనేది నాలుగు నెలల క్రితమే తెలిసినా ఆ మేరకు ఎరువులను తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం. వెంకటరెడ్డి, నాయకులు కె. ప్రదీప్‌రెడ్డి, బంటు మహేందర్, బి. శ్రీనివాసయాదవ్, చిమట వెంకన్న, ఆర్. సైదులుగౌడ్, బి. సురేష్, కె. సైదిరెడ్డి, జి. వెంకటయ్య, డి. వెంకటేష్ పాల్గొన్నారు.

శివకేశవులకు విశేష పూజలు



హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వా మి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఖజానాకు రూ.18,56,806 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావ్ తెలిపా రు. కాగా, కెనడాలో తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. అత్యంత వైభవంగా నిర్వహించిన కళ్యాణోత్సవంలో టొరంటో ఎంపీ దీపక్ ఆనంద్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బుద్ధవనం సందర్శన అద్భుతమైన అనుభూతి



బుద్ధవనంలో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ తదితరులు

నాగార్జునసాగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో తెలంగాణ పర్యాటక శాఖ నిర్మించిన బుద్ధవనం సందర్శన అద్భుతమైన అనుభూతిని ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ అన్నారు. నాగార్జునసాగర్ సందర్శనలో భాగంగా సోమవారం ఆయన జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ, సాగర్ ప్రధాన డ్యాం, బుద్ధవనాన్ని తిలకించారు. బుద్ధవనంలో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధవనంలో చరిత వనం, జాతక వనం, ధ్యాన వనం, స్థూప వనంలను తిలకించారు. మహాస్థూపం లోపల బుద్ధ జ్యోతిని వెలిగించారు. బుద్ధవనం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలిపే వీడియోను తిలకించారు. అయనకు బుద్ధవనం ఈవో రవిచంద్ర, ఎస్టేట్ మేనేజర్ శాసనాలు బుద్ధవనం విశేషాలను వివరించారు. పంచశీల కండువాతో సన్మానించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పర్యాయక శాక బుద్ధవనాన్ని మహాద్భుతంగా నిర్మించిందన్నారు. మహాయాన బౌద్ధాన్ని బుద్ధవనంలో పునర్నిర్మించడం గొప్ప విషయమని అన్నారు. ఆయన వెంట ఏపీ టీడీపీ లీగల్ సెల్ సలహాదారుడు పోసాని వెంకటేశ్వర్లు, విజిట్ మీడియా ప్రతినిధి సుధాకర్, డాక్టర్ జయకుమార్, పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ ఉన్నారు.

సాగర్, మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి/నాగార్జునసాగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జనసాగర్‌కు, మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. సాగర్ 18గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుంచి 1,90,042 క్యూసెక్కుల వరద వస్తుండగా, అంతే నీటిని దిగువకు వదులుతున్నాఉ. ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఈ నెల ఆరంభంలో మూసీ నది ఉధృతంగా ప్రవహించి, భారీగా వరద నీరు మూసీ ప్రాజెక్టుకు చేరడంతో 13రోజుల పాటు ప్రాజెక్టు క్రస్టుగేట్లు ఎత్తి అధికారులు వరద నీటిని దిగువ మూసీకి వదిలారు. ఈ క్రమంలో తగ్గుముఖం పట్టిన ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం 1702.87క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం 1854.59క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు 2వ నెంబరు క్రస్టుగేటును ఒక అడుగు మేర ఎత్తి 646.87క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఆర్థిక సేవలను వినియోగించుకోవాలి

● కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ అనురాధ

భువనగిరి రూరల్/ వలిగొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకుని ఆర్థిక పరిపుష్టి పెంపొందించుకోవాలని కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ అనురాధ అన్నారు. భువనగిరి మండలం కూనూరు గ్రామంలో సోమవారం జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జన సురక్ష బీమా పథకాలు , స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ రుణాల మీదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రాధాన్యత పీఎం జన్‌ధన్ యోజన , పీఎం జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన నమోదు ప్రక్రియపై దృష్టి సారించాలన్నారు. అదే విధంగా ప్రస్తుత ఖాతాల కేవైసీ ప్రాముఖ్యం, సైబర్ మోసాల నుంచి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్బీఐ అధికారులు అవగాహన సమావేశంలో పాల్గొని ముఖాముఖి మాట్లాడి ప్రాంతంలో బ్యాంకింగ్ సౌకర్యాల లభ్యతపై ఖాతాదారుల నుంచి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ శాంతికుమార్, ఎల్‌డీఎం శివరామకృష్ణ, అదనపు డీఆర్‌డీవో జంగారెడ్డి, డీపీఎంలు ప్రభాకర్, రవీందర్, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఏపీఎం పాశికంటి మల్లేశం, బ్యాంక్ మేనేజర్లు, లీడ్ బ్యాంకు సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

● వలిగొండ మండలంలోని అరూరు గ్రామంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జననీ సురక్షా బీమా పథకాలు, స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ రుణాలపై అవగాహన నిర్వహించారు. సమావేశంలో కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ అనురాధ, బ్యాంకు హనుమకొండ రీజనల్ మేనేజర్ శాంతికుమార్, లీడ్ డిస్టిక్ మేనేజర్ శివరామకృష్ణ, అదనపు గ్రామీణభివృద్ధి అధికారి జంగారెడ్డి, డీపీఎంలు ప్రభాకర్, రవీందర్, సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి సత్తా నిరూపించుకోవాలి

● మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గౌరవం లేని దగ్గర ఉండడం కంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి దమ్ము, ధైర్యం ఉంటే సొంతంగా పోటీ చేసి సత్తాను నిరూపించుకోవాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో సోమవారం బీజేపీ మండల కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రజా సమస్యలను పక్కన బెట్టి మంత్రి పదవి కోసం కొట్లాడడం చూస్తుంటే ఉమ్మడి జిల్లా ప్రజలకు సిగ్గేస్తోందని ఎద్దేవా చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమాల ఖిల్లా అని, పౌరుషానికి పెట్టింది పేరని, అంతటి ఘనమైన జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే తనకు మంత్రి పదవి కోసం ఉద్యమాల ఖిల్లా విలువను తీస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశా రు. ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం లేని ము ఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను అవమాన పరిచే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజీనామా చేయాలని, లేదా బర్తరఫ్ చేయాలని రాష్ట్రపతికి విన్నవిస్తామని ఆయన తెలిపారు. చౌటుప్పల్ ప్రాంత అభివృద్ధి కోసం పరిశ్రమలు కేటాయిస్తున్న వందల కోట్ల సీఎస్సార్ నిధుల్లో 80 శాతం ఎమ్మెల్యే అనుచరులు, కాంగ్రెస్ నాయకులు తింటున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్ రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు కైరంకొండ అశోక్, కడారి కల్పన, నాయకులు దూడల బిక్షంగౌడ్, రామనగోని శంకర్, ముత్యాల భూపాల్‌రెడ్డి, కడారి అయిలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

దూరవిద్యతో ఉజ్వల భవిత

● డిప్యూటీ డైరెక్టర్ ధర్మానాయక్

భువనగిరి టౌన్/ ఆలేరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దూరవిద్యలో చదువు కుంటే ఉజ్వల భవితసాధ్యమవుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ ధర్మనాయక్ అన్నారు. సోమవారం భువనగిరిలోని ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెం టర్‌ను ఆయన పరిశీలించి మాట్లాడా రు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరిన్ని నూ తన కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరం డిగ్రీ ప్రవేశాల గడువును ఈనెల 30 వరకు పొడిగించినట్టు తెలిపారు. ప్రతీ కౌన్సిలర్ కనీసం 50 అడ్మిషన్లు తేవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, కోఆర్డినేటర్ డాక్టర్ గంజి రమేష్, బి.బాలయ్య, లెక్చరర్లు, పి.బాల్‌రెడ్డి, కే.కిష్టయ్య, ఎన్.సత్యనారాయణ, ఎన్.సుధ, బి.పాండురంగం, కే.బాలరాజు, ఎండీ.ఆసిఫ్ అలీ, ఎస్.లింగమూర్తి, ఎస్ఎస్విఎన్ శివప్రసాద్, ఎండీ.అత్తర్ ఫారిన్, డి.పాండురంగం, ఆర్.బాలరాజు పాల్గొన్నారు. ఆలేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడి సెంటర్‌ను అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరక్టర్ ధర్మా నాయక్ పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.రాజారాం స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ జ్యోతి,అధ్యాపకులు పాల్గొన్నారు.



భువనగిరిలో ధర్మానాయక్‌ను సన్మానిస్తున్న స్టడీసెంటర్ నిర్వాహకులు



ఆయిల్‌పామ్ కాతను పరిశీలిస్తున్న అధికారులు

ఆయిల్‌పామ్ తొలి కాత కోత

ఆత్మకూరు (ఎం), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరిజిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన ఏనుగు దయాకర్‌రెడ్డి నాలుగేళ్లుగా 10 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంట మొదటి దశ కాత రావడంలో సోమవారం అయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ ఖాజామొయినుద్దీన్, డీహెచ్ఎస్ఓ మాధవిల సమక్షంలో మొదటి దశ కోత కోశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతీ గెల దాదాపు 2.5 కిలోల నుంచి 3 కిలోల వరకు బరువు తూగుతుందని తెలిపారు. ఈదశలో మొత్తం కాత 1టన్ను వరకు రావచ్చని అంచనా వేశారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి స్రవంతి, మండల వ్యవసాయ అధికారిని పూజ, ప్రవీణ్, శివ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న రహత్‌ఖానం, పోలీస్‌సిబ్బంది

రామన్నపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రహత్‌ఖానం అన్నారు. సోమవారం నాడు రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రహత్‌ఖానం ఇంటర్నల్ కంప్లెయింట్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ అధికారులు ర్యాగింగ్ నిరోధక చట్టం ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినుల పట్ల గౌరవంగా ఉండాలని, ప్రతీ విద్యార్థీ సమాజ నిర్మాణానికి తోడ్పడాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

వీల్‌చైర్ బాస్కెట్ బాల్ జాతీయ పోటీలకు ఎంపిక

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీకి మండలంలోని రంగుండ్లతండాకు చెందిన ధరావత్ సురేష్‌నాయక్ ఎంపికయ్యాడు. వచ్చే నెల 1 నుం చి 10వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో గల అటల్ బీహారీ ట్రైనింగ్ సెంటర్ ఫర్ డిజెబిలిటి స్పోర్ట్స్ ఆవరణలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. రాష్ట్ర జట్టు తరుపున సురేష్ ప్రాతినిధ్యం వహించనున్నాడు.



వీల్‌చైర్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన సురేష్

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

మర్రిగూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో మున్నయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులు నిర్మాణంలో నిర్లక్ష్యం చేయవద్దని త్వరితగతిన ఇంటి నిర్మాణం చేసుకుంటే సకాలంలో బిల్లులు అందుతాయని అన్నారు. ఆయన వెంట మర్రిగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి యూసుబ్ ఉన్నారు.

నాయబ్‌తహసీల్దార్‌గా అజీముల్లా షరీఫ్

నార్కట్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల నాయబ్ తహసీల్దార్‌గా మహ్మద్ అజీముల్లా షరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతకాలం ఇక్కడ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేసిన రామకృష్ణ తిప్పర్తికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

సమస్యలను పరిష్కరించరూ..

మా ఇల్లు మాకు ఇప్పించండి



మాకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. వారందరికీ విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా వారికి వివాహాలు కూడా చేసి జీవితంలో స్థిరపడటానికి ఎంతో తోడ్పాటునందించాం. అయితే మా చిన్న కుమారుడు మా పేరిట ఉన్న ఇంటిని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి వారి పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. దీనిని ఆలస్యంగా గుర్తించిన తాము సీనియర్ సిటిజన్ యాక్టు -2007 ప్రకారం నా పేరు మీద గల ఇల్లును నా కుమారుడు, కోడలు నుంచి తమకు ఇప్పించాలని కోర్టులో అప్పీల్ చేయడం జరిగింది. దయచేసి విచారణ జరిపించి తమకు న్యాయం చేయండి.

- రమణారెడ్డి, చంద్రకళ దంపతులు, హౌజింగ్‌బోర్డు కాలనీ, మిర్యాలగూడ



బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

'ప్రజావాణి'కి వెల్లువెత్తిన వినతులు

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ప్రజలు వారం వారం కలెక్టరేట్‌లో నిర్వహిం చే ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతున్నా రు. వారిలో కొందరు కిందిస్థాయిలో అధికారుల చుట్టూ తిరిగి చివరకు ప్రజావాణికి హా జరవ్వగా.. మరికొందరు మాత్రం అనేక మా ర్లు కలెక్టర్ కార్యాలయానికి వచ్చినా న్యాయం జరగకపోవడంతో మరో మారు ప్రజావాణికి వచ్చిన వారు ఉన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇతర అధికారులతో కలిసి వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిలో కొన్నింటిని అక్కడిక్కడే పరిష్కరించగా, మరి కొన్నింటి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.

బ్యాటరీ ట్రై సైకిల్ ఇప్పించండి



నేను పుట్టుకతోనే దివ్యాంగుడిని. నిరుపేద కుటుంబానికి చెందిన నేను అతి కష్టం మీద జీవితాన్ని వెళ్లదీస్తున్నాను. నే ను ఎక్కడికి వెళ్లాలన్నా ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది. గతంలో ప్రభుత్వం ద్వారా ట్రైసైకిల్ మంజూరైనా అవి కొంతకాలం వరకు మాత్రమే నడిచాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు ఇస్తున్నారు. నాకు కూడా బ్యాటరీ మంజూరు చేయాలని, నెల రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. అయితే అధికారులు మాత్రం నాన్చివేత ధోరణిని అవలంబిస్తున్నారు. దయచేసి బ్యాటరీ ట్రై సైకిల్ ఇప్పించండి.

- ధనావత్ సేవ, అర్వతండా, త్రిపురారం

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు



మాది నిరుపేద కుటుంబం. నాకు ముగ్గురు సంతానం. మూడవ సంతానంలో జన్మించిన అబ్బాయి పుట్టుకతోనే శారీరక, మానసిక వికలాంగుడిగా జన్మించాడు. అతనికి పదేళ్ల వయస్సు వచ్చిన అనంతరం వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసేందుకు 2019లో సదరం క్యాంపునకు హాజరు కాగా 100 శాతం వైకల్యంతో సర్టిఫికెట్ జారీ చేశారు. దీంతో అప్పట్లో పింఛన్ మంజూరైంది. కానీ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆన్‌లైన్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మంజూరైన పింఛన్ నిలిచిపోయింది. అప్పటి నుంచి ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. అయినా ఎలాంటి ఫలితం లేదు. దయచేసి పింఛన్ ఇప్పించండి.

-బొడ్డు అనిత, రేగట్టె, కనగల్

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం : బీఎల్‌ఆర్



పాములపాడులో జీపీ భవన నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మాడ్గులపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని పాములపాడు గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని, ప్రజాపాలనతో పేదల బాధలు తీరాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులు, గడ్డం పురుషోత్తంరెడ్డి, పొలిశెట్టి ఉపేందర్, హరికృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీచేస్తున్న రవిప్రసాద్

నల్లగొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడటం కోసమే సామాజిక సేవ కార్యక్రమంలో మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్నట్లు వైఆర్‌పీ వ్యవస్థాపకుడు ఎలిశాల రవిప్రసాద్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో సో మవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. వైఆర్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా 10వేల మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వినాయక విగ్రహాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు చేయూత, క్రీడలు, సంక్షేమం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పారేపల్లి భరత్, యాయ కవిత దయాకర్, యామ దయాకర్, వీరెళ్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, వేనేపల్లి లక్ష్మణ్‌రావు, వైఆర్‌పీ వలంటీర్లు శ్రీనివాస్, సురేష్, సంతోష్, వెంకట్, విజయ్ పాల్గొన్నారు.

నేడు క్రెడాయ్, కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో....

జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల వద్ద క్రెడాయ్ ఆధ్వర్యంలో మట్టి గణపతులు పంపిణీ చేయనున్నట్లు క్రెడాయ్ రాష్ట్ర కార్యదర్శి బండారు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాంపల్లి మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ శరత్‌చంద్రపవార్ హాజరవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వేల మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీ చరణ్ తెలిపారు.

బీపీ మండల్ సిఫారసులను అమలుచేయాలి

నల్లగొండ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ సంస్థ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు డిమాండ్ చేశారు. సోమవారం బీసీ రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వర్ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి కేశవులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చట్టాలు లేని రోజుల్లో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పోరాడిన యోధుడన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు మేకల శ్రీహరి, చరణ్ పాల్గొన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గట్టుప్పల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎస్‌ఐ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేష్ విగ్రహాలను ఏర్పాటు నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. నిర్వాహకులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్‌ఐ అంజయ్య, పోలీస్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

శాలిగౌరారం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన పొడేటి చంద్రయ్య కోరారు. గ్రామానికి చెందిన ఉద్యోగుల గ్రూప్ ఆధ్వర్యంలో గ్రామంలోని జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 1లక్షా50వేల విలువైన టై, బెల్టు షూస్, ఐడీ కార్డులతో పాటు పాఠశాలకు మైక్ సెట్, ఉపన్యాస పోడియంను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పొడేటి చంద్రయ్య మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విద్యలో రాణిస్తూ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. డీఆర్‌డీవో సీనియర్ శాస్త్రవేత్త రామస్వామి యాదగిరి మాట్లాడుతూ భవిష్యత్తులో దేశ రక్షణలో విద్యార్థులు యువత భాగస్వామ్యం కావాలని కోరారు. పాఠశాలలో పదవ తరగతిలో 500 మార్కులు దాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామస్థులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మందుల సైదులు, జడ్పీహెచ్‌ఎస్, పీఎస్ హెచ్‌ఎంలు రామాచారి, చంద్రారెడ్డిలు, ఉద్యోగుల గ్రూపు సభ్యులు నగేష్, మల్లికార్జున్, నల్లా చక్రపాణి, బిక్షం, భాస్కర్ పాల్గొన్నారు.

రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఇవ్వాలి



వెలిమినేడులో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కేతేపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన మేరకు ప్రభుత్వం యూరియా సప్లై చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు డిమాండ్ చేశారు. యూరియా కొరతను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం నాయకులు స్థానిక పీఏసీఎస్ వద్ద ఆందోళన నిర్వహించి, మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రైతుల అవసరాల మేరకు యూరియాను కేటాయించక పోవడంతో కొరత ఏర్పడిందన్నారు. యూరియా కొరతను ఆసరా చేసుకున్న కొందరు ప్రైవేటు వ్యాపారులు రైతులకు అసరంలేని క్రిమిసంహారక మందులు అంటగడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరినొకరు నిందించుకోవడం మాని రైతులకు అవసరమైన మేర యూరియాను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. రైతుల అవసరాలను అవకాశంగా తీసుకుని దోచుకుంటున్న ప్రైవేటు ఎరువుల డీలర్లపై విజిలెన్స్ దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఎల్.రాజు, సీహెచ్.నాగయ్య, కె.బాలయ్య, ఎస్.వెంకన్న, నీలం సైదులు, సౌడయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: కట్టంగూరులో సీపీఎం ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి గిరిప్రసాద్‌కు సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు సందీప్‌రెడ్డి, అంజయ్య, యాదగిరి, సాగర్ రెడ్డి, అంజి రెడ్డి, నర్సింహ ఉన్నారు.

గట్టుప్పల్: మండల కేంద్రంలోని గట్టుప్పల్ వ్యవసాయ అధికారి రేవతికి సీపీఎం రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ శ్రీశైలం, సీపీఎం జిల్లా నాయకులు చాపల మారయ్య, మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, అచ్చిని శ్రీనివాస్, కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ, సీనియర్ నాయకులు ఏం డి రబ్బాని, రైతు నాయకులు బుచ్చిరెడ్డి, శివన్నగూడెం సింగిల్ విండో చైర్మన్ బాలెం నరసింహ పసుపులచెన్నయ్య, కర్నాటి యాదయ్య, గిరి, బిక్షం పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, కొప్పు శ్రవణ్, దండు రవి, ఆమనగంటి అయిలయ్య, కల్లూరి కంఠ మహేశ్వర్, నన్నేసాహెబ్, దండు శంకర్, మిర్యాల రాములు, లింగస్వామి రైతులు పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలరూరల్: చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, అరూరి శ్రీను, పంది నరేష్, అరూరి శంభయ్య, నాతి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు. వెలిమినేడు పీఏసీఎస్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు అరూరి శ్రీను, పంది నరేష్, అరూరి శంభయ్య, నర్సింహ, నాతి వెంకట్రామయ్య, సుర్కంటి మోహన్‌రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి సహస్‌కు వినతి పత్రం అందజేశారు.

అంగడిస్థలంలో అక్రమ కట్టడాలు తొలగించాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని అంగడి స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీడీవో ఉమేష్‌చారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూరగాయల స్థలంగా కొనసాగుతున్న అంగడి స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని, హనుమాన్ దేవాలయం ఎదురుగా మాంసం విక్రయ దుకాణాలను మూసివేయించాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అక్రమ కట్టడాలను తొలగించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో తొలగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, నోముల నాగరాజు, బెక్కంటి గణేష్, ఏర్పుల పరమేష్, వడ్డేగోని రామలింగం, మేడబోయిన శేఖర్, లింగాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల జన్మదిన వేడుకలు



మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కంచర్ల భూపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ అభిమానులు, కార్యకర్తలు కేక్‌ను కట్ చేయడంతో పాటు ఆలయాల్లో పూజలు, రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు, పండ్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్‌రెడ్డి హాజరై కేక్‌ను కట్ చేసి భూపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యేకు పండ్లతో కూడిన గజమాలను వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, చీర పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, రేగట్టె మలికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ప్రత్యేక పూజలు జరిపించారు.

నడ్డివారిగూడెంకు రహదారి నిర్మించాలి



పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నల్లగొండరూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని 11వ వార్డు నడ్డివారిగూడెం నుంచి పట్టణానికి వెంటనే డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నడ్డివారిగూడెం నుంచి మన్నేగూడెం, గంధంవారిగూడెం, అక్కలాయగూడెం మీదుగా మునిసిపల్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడ్డివారిగూడెం నుంచి నల్లగొండకు రావాలంటే రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం మునిసిపల్ ఈఈ రాములుకు వినతిపత్రం అందించారు. ఈ పాదయాత్రలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, నాయకులు తుమ్మల పద్మ, రవీందర్, కృష్ణారెడ్డి, సరోజ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్‌డీలర్లు

కేతేపల్లి, శాలిగౌరారం, కట్టంగూరు, గట్టుప్పల్, రామగిరి కనగల్, మునుగోడు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల రేషన్ డీలర్ల కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని రేషన్‌డీలర్లు డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ రేషన్ డీలర్ల కమిషన్ ఇవ్వకపోవడంతో రేషన్ డీలర్ల కుటుంబ పోషణ ఇబ్బదింకరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులతో చర్చలు జరిపి కమీషన్ వచ్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఏప్రిల్, మేతో పాటు జూన్, జూలై, ఆగస్టు నెలలకు ఒకేసారి పేదలకు రేషన్ బియ్యాన్ని ఉదయం 7 నుంచి రాత్రి 10గంటల వరకు పారదర్శకంగా అందించామని తెలిపారు. ఏ నెలా కమీషన్ ఆ నెల రేషన్ డీలర్ల ఖాతాల్లో జమ చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం కమీషన్ అందించి ఆదుకోవాలన్నారు. నల్లగొండలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు, నాయకులు వైద్యుల సత్యనారాయణ, కోటగిరి సూర్యనారాయణ, బొల్లా వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ విధానాన్ని రద్దుచేయాలి

మర్రిగూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని దామరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి జీవో 28 ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు సంజీవరావు, పరంగే స్వరూపరాణి, గిరి వెంకటయ్య, మంజులత, కొండ శ్రీనివాస్, వెంకట్‌కుమార్ పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్: ప్రభుత్వ రంగంలో సేవలందించే ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వం ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు కుంచరకుట్ల సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1వ తేదీన జరిగే ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి, పెద్దకాపర్తి జడ్పీహెచ్‌ఎస్‌లలో ధర్నా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఓపీఎస్‌ను సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందిన బి.సుశీల, జి.రమాదేవి, బి.శ్రీధర్, బి. మోహన్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బాదం భిక్షపతి, లుకేందర్‌రెడ్డి, శరత్, సత్తయ్య, వెంకట్‌రావు, యశోధరరెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలి



నల్లగొండలో ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ మండలంలోని అసంపూర్తిగా నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసుధన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలోని అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతెపాక లింగస్వామి, మంగలిపల్లి కిషన్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.


కనగల్: బీజేపీ మండల అధ్యక్షుడు పర్సనబోయిన బిక్షం ఆధ్వర్యంలో జీఎడవల్లి నుంచి కనగల్ వరకు నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌రెడ్డి, నాయకులు బద్దమ్మ, పాపిరెడ్డి, బిక్షం, సైదులు, వెంకన్న, ఎన్‌వెంకన్న, నవీన్ సరిత, శేఖర్, నాగేందర్, దేవేందర్, గోపి, కనకయ్య, వెంకట్‌రెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

కేతేపల్లి : మండల కేంద్రం కేతేపల్లిలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పబ్బు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నాయకులు కేతేపల్లి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్, నాయకులు ఎ.అనితాగౌడ్, టి.నర్సింహ్మాచారి, సీహెచ్.జానయ్య, పద్మ, ఎస్.విజయలక్ష్మి, వి.నాగయ్య, టి.అఖిల్ పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మైల నర్సింహ, బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న, పొట్లపల్లి నర్సింహ్మా, పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, గరిశె నరేష్, పన్న విష్ణు, అంశాల అనిల్ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య


కట్టంగూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని మనస్థాపంతో ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణం చెందాడు. ఈ సంఘటన కట్టంగూరు మండలంలోని అక్కలాయిగూడెంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఊట్కూరి మంజుల,ముత్తయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ముత్తయ్య దివ్యాంగుడు. రెండో కుమారుడైన ఉట్కూరు బన్ని (21) ప్రైవేట్ డ్రైవర్‌తో పాటు కూలీ పనులు చేసేవాడు. కొంతకాలంగా ఎలాంటి పని చేయకుండా ఇంటివద్ద ఖాళీగా ఉంటున్నాడు. దీంతో పాటు ఇంట్లో ఎవరూ పనిచేయకపోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. కుటుంబపోషణకు ఆసరాగా ఉండవా అంటూ బన్నీని తల్లి మందలించింది. దీంతో మనస్థాపం చెంది ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇంటి పక్కనే ఉన్న వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. తన చిన్న కుమారుడైన చంటి నిద్రలేచి ఇంటిపక్కనే ఉన్న వేపచెట్టుకు బన్నీ వేలాడుతూ ఉండగా చూసి కేకలు వేశాడు. దీంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. తన కొడుకు మృతిపై మాకు ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి తల్లి మంజుల సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి నకిరేకల్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.30 (298.3005)	1,90,042	1,90,042 (18గేట్ల ఎత్తివేత)
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.65 (4.11)	1,260	1,859
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.814 (38.0890)	2,27,382	1,14,494

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220



ఇక వ్యవసాయశాఖ పల్లెబాట

- నేటి నుంచి పంటల నమోదు ప్రక్రియ
- మూడు జిల్లాల్లో నవంబరు 1లోగా సర్వే పూర్తికి ఏర్పాట్లు
- ఈసారి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీల్లో రైతులు, పంటల వివరాల ప్రదర్శన
- కచ్చితమైన సమాచార సేకరణకు అధికారుల నిర్ణయం
- ప్రతి రైతు సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తం

రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పంటల నమోదు ప్రక్రియకు నిర్ణయించింది. ఈ నెల 26 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, నవంబరు 1వ తేదీ నాటికి పూర్తిచేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పంటల నమోదు ప్రక్రియలో భాగంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ

వ్యవసాయశాఖ ప్రత్యేక రూపొందించిన డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో ప్రతీ రైతు వివరాలు, పంటల సాగు, పట్టాదారు పాస్‌పుస్తకం నెంబర్, సర్వే నెంబర్లు, సాగు చేసిన విస్తీర్ణం తదితర వివరాలను నమోదుచేస్తారు. ఈ డిజిటల్ క్రాప్ సర్వేలో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కచ్చితమైన వివరాలను నమోదుచేస్తారు. అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూసేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది. ఈ సర్వేలో వ్యవసాయశాఖ రూపొందించిన ఏఈవో యాప్‌తో పాటు డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను ఉపయోగించనున్నారు. ప్రతీ క్లస్టర్‌లో, ప్రతీ రైతును యూనిట్‌గా తీసుకొని వారి వివరాలను అధికారులు నమోదుచేస్తారు. అదేవిధంగా సాగు చేసిన పంటల ఫొటోలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. పంటల వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేయడం ద్వారా కచ్చితత్వం పెరుగుతుందని వ్యవసాయశాఖ అభిప్రాయపడుతోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెల వరకు మొత్తం మూడు నెలలకుపైగా వ్యవసాయ అధికారులు పల్లెబాట పట్టనున్నారు. మూడు జిల్లాలో సాగు విస్తీర్ణంపై సర్వే చేయనున్న అధికారులు సాగుభూమి ఎంత? ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నారు? అని పరిశీలించి వీటిని నమోదుచేస్తారు.

ఉమ్మడి జిల్లాలో 4లక్షలకు పైగా సర్వేనెంబర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 73 మండలాల్లో ఆయా క్లస్టర్ల వారీగా 4,10,729 సర్వే నెంబర్లలో వ్యవసాయ భూములు విస్తరించి ఉన్నాయి. ఈ భూముల్లో ఏ పంటలు సాగుచేశారో అధికారులు యాప్‌లో నమోదు చేస్తారు. నల్లగొండ జిల్లాలో 132 క్లస్టర్లలోని 1,95,957 సర్వే నెంబర్లలో 12,47,562ఎకరాల పంట విస్తీర్ణం ఉంది. సూర్యాపేట జిల్లాలో 1,06,012 సర్వే నెంబర్లలో 6,32,506 ఎకరాల్లో పంటలు విస్తరించి ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 1,08,760 సర్వే నెంబర్లలో 6,07,285 ఎకరాల్లో పంటల విస్తీర్ణం ఉంది. ఈ సర్వే నెంబర్ల ఆధారంగా పంటల విస్తీర్ణాన్ని, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గతంలో సమయం సరిపోక పోవడంతో పంటల నమోదుకు అదనపు గడువును ప్రభుత్వం ఇచ్చింది. ఈ మారు ఏకంగా మూడు నెలలకు పైగా ప్రభుత్వం గడువును కేటాయించింది. ఈ గడువులోగా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పంటల నమోదును పూర్తిచేయాలని ప్రభుత్వం వ్యవసాయశాఖ మిగతా 6వ పేజీలో...



పకడ్బందీగా పంటల నమోదు

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల నమోదు ప్రక్రియను ఈనెల 26 నుంచి నవంబరు 1వ తేదీ వరకు నిర్వహిస్తాం. ఏఈవోలు ప్రతీ గ్రామానికి వెళ్లి, ప్రతీ సర్వేనెంబర్‌లో పంటలు, రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వ్యవసాయ అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు వారికి సహకరించి పంటల, ఇతర వివరాలను అందజేయాలి. ఈ నివేదికను పూర్తిస్థాయిలో నవంబరు మొదటి వారంలో ప్రభుత్వానికి అందజేస్తాం. ప్రతి వ్యవసాయ అధికారి గ్రామాలను సందర్శిస్తారు.

పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

పేదలకు అధునాతన వైద్య సౌకర్యాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ల్యాప్రోస్కోపిక్ ద్వారా పలు శస్త్ర చికిత్సలు : డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు అధునాతన వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లాలో వైద్యరంగాన్ని పటిష్టం చేస్తున్నట్టు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన లాప్రోస్కోపిక్ యూనిట్‌ను పద్మ విభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రపంచంలోనే గర్వించదగ్గ వైద్యుడు నాగేశ్వర్‌రెడ్డి ఈ ఆధునాతన లాప్రోస్కోపిక్ యూనిట్ ప్రారంభించడం సంతోషకర విషయమన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నానని, ఏడాదిలోపై ప్రభుత్వ వైద్యకళాశాలను నిర్మించామని, రూ.40కోట్లతో నర్సింగ్ కళాశాలను సైతం నిర్మిస్తున్నామన్నారు. శస్త్రచికిత్సలను ఇక్కడే నిర్వహించేలా, పేదలకు మేలు చేసేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో లాప్రోస్కోపిక్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికల్ విద్య పూర్తి చేసిన విద్యార్థులకు హైదారాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించాలని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జీజీహెచ్‌కు వెళ్లేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, జీవితంలో అందరికీ అవకాశాలు వస్తాయని, వాటిని అందిపుచ్చుకున్న వారే ముందుకు వెళ్తారని తెలిపారు. నల్లగొండ వైద్యశాల కళాశాల విద్యార్థులు ఏఐజీ ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తామని, అదేవిధంగా ఇక్కడి వైద్య కళాశాలను దత్తత తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్యాస్ ఎంట్రాలజిస్ట్ డాక్టర్ జీవీ.రావు, సామాజిక కార్యకర్త ఎస్పీ.రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వైటీపీఎస్‌లో ఉద్యోగాలు కల్పించాలి



ఆందోళన నిర్వహిస్తున్న వీర్లపాలెం గ్రామస్థులు

వీర్లపాలెం గ్రామస్థుల ఆందోళన

దామరచర్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్లపాలెం శివారులోని యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వీర్లపాలెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు గ్రామంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ, పవర్ ప్లాంట్ ఏర్పాటు సమయంలో గ్రామంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులతోపాటు గ్రామస్థులకు కూడా ఇంటికి ఒక ఉద్యోగం లేదా రూ.5లక్షల పరిహారం అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించినా, స్థానికుల గురించి పట్టించుకోవడంలేదని వాపోయారు. పవర్ ప్లాంట్‌లో సాగు భూములు పోవడంతో, వాటిని నమ్ముకొని కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న గ్రామస్థులు, రైతు కూలీలు ప్రస్తుతం పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. థర్మల్ ప్లాంట్ నుంచి వచ్చే కాలుష్య ప్రభావం గ్రామంపై అధికంగా ఉంటుందని, గ్రామానికి నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో గ్రామస్థులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా జీవో 98 ప్రకారం 2వేల ఉద్యోగాలు స్థానికులకు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణంలో సమస్యలు లేకుండా చూడాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, సామగ్రి విషయాల్లో ఇబ్బందులు కలగకుండా గృహనిర్మాణశాఖ పీడీ చొరవ తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇసుక ట్యాక్స్‌ను పంచాయతీరాజ్‌శాఖ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 1,000మెట్రిక్ టన్నుల ఇసుకను ఇచ్చేందుకు, మూసీ పూర్తిస్థాయిలో ప్రవహిస్తున్నందున పరివాహక ప్రాంతంలో అందుబాటులో నదీ తీరప్రాంతం నుంచి ఇసుకను తీసేందుకు తీర్మానించిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మెప్మా శాఖ సహాయ సంచాలకుడు జాకబ్, డీపీవో వెంకయ్య, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, గ్రౌండ్ వాటర్ డీడీ రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్ శాంతకుమారి, టీజీఎండీసీ పీవో మధు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కలెక్టరేట్): 'ప్రజావాణి'లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం 'ప్రజావాణి'లో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. పలు సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు కారణాలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. కాగా 'ప్రజావాణి'లో మొత్తం 80 ఫిర్యాదులు రాగా, వాటిలో రెవెన్యూశాఖకు చెందినవి 50, ఇతర శాఖలకు చెందినవి 35 ఉన్నాయి. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి): తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ, ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థినులకు చాక్‌లెట్లు పంపిణీచేశారు. కష్టపడి, ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి వైద్యుల హాజరు, తదితర రిజిస్టర్లను తనిఖీచేశారు. ఆమె వెంట తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సుధాకర్ తదితరులు ఉన్నారు.

రైల్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని భువగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం ఈ మేరకు సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ్‌ను హైదరాబాద్‌లో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఘట్కేసర్ నుంచి యాదాద్రికి ఎంఎంటీఎస్ రైలు భూసేకరణ అంశంపై మేడ్చల్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భువనగిరి నుంచి రాయిగిరి వరకు ఎంఎంటీఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రామన్నపేటలో ఫలక్‌నామా, శబరి, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే అసిస్టెంట్ జీఎం ఉదయ్‌నాథ్‌కోట్ల, ఎంఎంటీఎస్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ సాయిప్రసాద్, పాల్గొన్నారు.

ఎట్టకేలకు నిడమనూరు పోలీస్‌స్టేషన్ ప్రారంభం



నిడమనూరు పోలీస్‌స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ సురేష్, స్టేషన్ సిబ్బంది

నిడమనూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ భవనంలో ఏర్పాటు చేసిన నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభమైంది. స్టేషన్‌ను ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ద్వారా ప్రారంభింపజేయాలని ప్రయత్నించినా ఈ కార్యక్రమం ఐదుమార్లు వాయిదా పడింది. దీంతో ఎట్టకేలకు ఉన్నతాధికారులు లేకుండానే సోమవారం పూజలు నిర్వహించి స్టేషన్‌ను ఎస్ఐ ఉప్పు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తామని, విధి నిర్వహణలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌సీలు వెంకటేశ్వర్లు, కుంచం యాదగిరి, సిబ్బంది శేఖర్, సత్యం, రమేష్, నగేష్, హనుమా, నరేందర్, హనుమంతరావు, రామాంజనేయులు, మహేష్, కిరణ్, శ్రీకాంత్, మానస, అప్పారావు పాల్గొన్నారు.

కాగా, గతంలో ఉన్న పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించి మూడు దశాబ్దాలవడం, శిథిలమై పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో భద్రత దృష్ట్యా మండల పరిషత్ భవనంలోకి స్టేషన్‌ను తరలించారు. ఆ భవనంలో అవసరమైన మరమ్మతులు చేయించారు. మండల పరిషత్ భవనాన్ని పోలీస్‌స్టేషన్‌కు వినియోగిస్తున్నందునకు నెలకు రూ.11,312 అద్దె చెల్లించనున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'జనహిత'

● సమస్యలు తెలుసుకునేందుకే మార్నింగ్‌వాక్ ● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ 7



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీజీఈజేఏసీ, టీఎన్‌జీవోస్ నాయకులు

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

నల్లగొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 12న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో టీజీఈజేఏసీ, టీఎన్‌జీవోల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంతో పాటు, 17న ఉద్యోగుల చైతన్య సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సెప్టెంబరు 8 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి, ఎం.శ్రీనివాస్, జె.శేఖర్‌రెడ్డి, రామలింగం, ఎన్.శేఖర్‌రెడ్డి, నర్సింహాచారి, వెంకటేశ్వర్లు, అలీం, వెంకులు, మోహన్‌రావు, భిక్షమయ్య, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి : డీఎల్‌పీవో



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్

డిండి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలకు గ్రామపంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ తెలిపారు. తవక్లాపూర్ గ్రామంలో గృహ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో ఆయన సోమవారం విచారణ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, అనుమతులులేకుండా నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. పాత ఇళ్లను కూల్చి నూతన నిర్మాణం చేపట్టాలన్నా తప్పనిసరిగా గ్రామపంచాయతీ అనుమతి తీసుకోవాలన్నారు. పంచాయతీ రికార్డుల్లో ఇంటి వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నిర్మూలనకు సాయంత్రం సమయంలో ఫాకింగ్ చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జంగయ్య ఉన్నారు.

ఆశాలకు రూ.18వేలు వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.18వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాల చట్టం ప్రకారం రూ.26వేలు ఇవ్వాల్సి ఉండగా, రూ.9,500 మాత్రమే ఇస్తూ శ్రమను ప్రభుత్వాలే దోపిడీ చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేసి ర్యాలీగా డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరి, వెంకటమ్మ, అవుట రవీందర్, సత్యనారాయణ, సుధీర్, సైదులు, వసంత, స్వర్ణ, జ్యోతి, వెంకటమ్మ, అనూష, పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయని మిల్లులపై చర్యలు : డీటీ

చింతపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ లక్ష్యం పూర్తిచేయని రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచనరఘునందన్ అన్నారు. సోమవారం చింతపల్లి మండలంలోని నసర్లపల్లిలోని రైస్ మిల్లులో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

ధనకుంటను రీసర్వే చేస్తాం: తహసీల్దార్

డిండి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 14లో ఉన్న ధనకుంటను రీసర్వే చేస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ధనకుంట శిఖం భూమిని సోమవారం ఆయన నీటి పారుదలశాఖ డీఈ శ్రీనివాస్, సర్వేయర్ ముత్తయ్యతో కలిసి పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ధనకుంట శిఖం 25.19 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. తూమును ధ్వంసం చేయడం వల్ల కుంటలోని నీరంతా వృథాగా పోతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'జనహిత'

● సమస్యలు తెలుసుకునేందుకే మార్నింగ్‌వాక్ ● ఒకవైపు అభివృద్ధి పథకాల ప్రారంభం ● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



దేవరకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే జనహిత మార్నింగ్‌వాక్ విత్ పీపుల్స్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. దేవరకొండ మునిసిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజల వద్దకే వెళ్లి మార్నింగ్‌వాక్‌లో సమస్యలను తెలుసుకొని పరిష్కరించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి: ఇటీవల చేపట్టిన జనహిత మార్నింగ్ వాక్ విత్ పీపుల్స్ లక్ష్యమేమిటి?

ఎమ్మెల్యే: కాంగ్రెస్ ప్రజాపాలనలో భాగంగా ప్రజల వద్దకే మార్నింగ్‌వాక్‌కు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం, మరో వైపు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రారంభించి అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే దేవరకొండ మునిసిపాలిటీ, మరికొన్ని వార్డులు, దేవరకొండ, గుడిపల్లి మండలాల్లో జనహిత మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించాం.

ఆంధ్రజ్యోతి: జనహిత మార్నింగ్‌వాక్‌లో ప్రజలకు ఇస్తున్న హామీలేమిటి?

ఎమ్మెల్యే: జనహిత మార్నింగ్‌వాక్‌లో గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ పథకాలు, రేషన్‌కార్డులతో పాటు ఇతర పథకాలు అందుతున్నాయా అని తెలుసుకుంటున్నాం. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: నియోజకవర్గంలో ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్‌కార్డులు మంజూరయ్యాయి?

ఎమ్మెల్యే: నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. ఇప్పటికే మొదటి విడత నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. నూతనంగా 11,736కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశాం. 15837 మందికి నూతనంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: నియోజకవర్గంలో ప్రాజెక్టుల నిర్మాణం మాటేమిటి?

ఎమ్మెల్యే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుళ్ల నుంచి నీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందించి రూ.1800 కోట్లు మంజూరు చేశారు. శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి, పెండ్లిపాకల, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రతి గ్రామానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

ఆంధ్రజ్యోతి: అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల సమస్య పరిస్థితి ఏమిటి?

ఎమ్మెల్యే: దేవరకొండ పట్టణంలో ఇప్పటికే అన్ని వార్డులలో రోడ్ల నిర్మాణానికి రూ.55కోట్లు మంజూరయ్యాయి. కొన్ని రోడ్లకు శంకుస్థాపనలు చేశాం. గ్రామాల్లో కోట్లాది రూపాయలతో పంచాయతీరాజ్, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రోడ్లను నిర్మించి పూర్తి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న నిర్వాసితుల పరిహారం మాటేమిటి?

ఎమ్మెల్యే: డిండి ఎత్తిపోతల, పెండ్లిపాకల, నక్కలగండి ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు ఇప్పటికే పరిహారం అందజేశాం. పునరావాసం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. పెండ్లిపాకల రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందజేస్తాం. నిర్వాసితులకు పరిహారంతో పాటు పునరావాసం కల్పించి ఆదుకుంటాం.

ఆంధ్రజ్యోతి: నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే హామీలేమిటి?

ఎమ్మెల్యే: నియోజకవర్గ ప్రజలు వివిధ పనుల కోసం ఎప్పుడొచ్చినా అందుబాటులో ఉంటాను. సమస్యలను పరిష్కరిస్తాను. జనహిత మార్నింగ్‌వాక్‌లో నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పర్యటిస్తా. అంతేకాక దేవరకొండ పట్టణంలోని అన్ని వార్డుల్లో పర్యటించి మార్నింగ్‌వాక్‌లో సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తా.

దేవరకొండలో నేడు మట్టి వినాయకుల పంపిణీ

దేవరకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మున్సిపాలిటిలో ఈ నెల 26వ తేదీన మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలునాయక్ హాజరు కానున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజలు చేసుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి

దేవరకొండ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నల్లగొండ హాస్టల్స్ విభాగం కన్వీనర్ యలమల గోపిచంద్ డిమాండ్ చేశారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెడేళ్లవుతున్నా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నగర కార్యవర్గ సభ్యులు విక్రమ్, బూషరాజు ఈశ్వర్, హనుమంతు, చిన్ననాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'తో సొంతింటి కల సాకారం


లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలు అందిస్తున్న వెంకట్‌బాబు

నిడమనూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పథకంతో పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తుందని కాంగ్రెస్ యువ నాయకుడు మేరెడ్డి వెంకట్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయడంతో పాటు ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిఆపరు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి, నాయకులు శేషరాజు దాసు, మోసాల శ్రీను, కడెం తిరుపతిరావు, శంకర్, పురుషోత్తంరెడ్డి, దాసు, సాయిబాబా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నందికొండలో సమస్యలను పరిష్కరించాలి

నాగార్జునసాగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):నందికొండ మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పెద్దవూర మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కాలనీల్లో పారిశుధ్యం పడకేసిందని, వీధు ల్లో కుక్కలు, పందులు, కోతులు స్వైరవిహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హె చ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగార్జున, గోవిందు, ఆ నంద్‌పాల్, రమేష్, కృష్ణ , రోషయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సంరక్షణకు కృషి

చింతపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీవో సక్కుబాయి అన్నారు. సోమవారం మండలంలోని తిరుమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌అభియాన్‌లో భాగంగా గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీమంతం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. సమయపాలన పాటించి అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంజమ్మ, టీచర్ ఉజ్జిని రమాదేవి, ఆయా రాజమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

29 నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు

వేములపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు ఈనెల 29 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం మండల స్థాయి క్రీడలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అండర్- 14, 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29న బాలురకు, 30న బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, పీడీలు వెంకట్‌రెడ్డి, సుమన్, పుల్లయ్య, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోతులు, కుక్కల దాడులను నివారించాలి

నాగార్జునసాగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోతులు, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సమాచార హక్కు మానవ హక్కు లా సమితి కోరారు. సోమవారం సాగర్ హిల్‌కాలనీలో కోతులు, కుక్కల దాడుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్, సాగర్ డివిజన్ అటవీశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో సహ చట్టం సాగర్ సభ్యులు విజయ్, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు రజియా, రాజ్యం, స్నేహలత, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలను సీజ్ చేయాలి : ఏఐఎస్‌ఎఫ్

డిండి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒకేషనల్ కళాశాలను సీజ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సురిగి వినయ్, బలుముల ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల ఎదుట విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిల్డింగ్ అద్దె చెల్లించలేదని యజమాని కళాశాలకు తాళం వేయడంతో విద్యార్థులు వారం రోజులుగా కళాశాలకు వచ్చి వెనుదిరుగుతున్నారని వారు తెలిపారు. కళాశాలలో ఎలాంటి సౌకర్యాలు లేవని ఆరోపించారు. ఉన్నతాధికారులు వెంటనే కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్యాణ్, పవన్‌రాజు, సాయి, శిల్ప, శిరీష, శివాజీ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


అడవిదేవులపల్లి: ముల్కచర్లలో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి, వేములపల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ముల్కచర్ల గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనానికి, రూ.8లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ, మహిళలకు ఫ్రీ బస్సు, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల వరకు ఉచిత బియ్యం, రైతులకు రుణమాఫీ, రైతుబీమా, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాతంగి రమేష్, ఎంపీవో మోసిన్‌బిన్‌అహ్మద్, పంచాయతీ కార్యదర్శి ఎం.రవికుమార్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వేములపల్లి మండల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని సల్కునూరు గ్రామంలో నిర్వహించిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, రాష్ట్ర నాయకుడు సైదులాబ్‌నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, పుట్టల కృపయ్య, పిల్లల సందీప్, చాడా జానిరెడ్డి, నారబోయిన సతీష్, అంకెపాక సైదులు తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి


దామరచర్ల: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చందంపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 50లో ప్రభుత్వ భూమిలో ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుంటోజు వినోదచారి డి మాండ్ చేశారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు భూ కబ్జాలపై వినతిపత్రం అందజేశారు. అర్హులకు న్యాయం చేయాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాల ని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రెడ్డి శంకర్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, శీను, దస్రునాయక్ పాల్గొన్నారు.

మండలంలోని సమస్యలను పరిష్కరించాలి

దామరచర్ల: మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాధినేని శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను చేపట్టాలని, యాదాద్రి పవర్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని, మండల కేంద్రంలోని రహదారి వెంట సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లోని రోడ్లను మరమ్మతులు చేపట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేషానాయక్, నాయకులు అశోక్‌రెడ్డి, బండి సైదులు, ఈగ సైదారావు, జానకిరాంరెడ్డి, నిమ్మల విజయ్, పిచ్చయ్య, సైదిరెడ్డి, నరసింహారెడ్డి, జానయ్య, నాగిరెడ్డి, అశోక్, రాములు పాల్గొన్నారు.

యూరియా సకాలంలో అందించాలి



దామరచర్ల రైతు వేదికలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

దామరచర్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియాను అందించాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని రైతువేదిక వద్ద సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. రాష్ట్రంలోని రైతులకు సరిపడా యూరియా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు పాపానాయక్, కోటిరెడ్డి, దయానంద్, ఖాజా మోహిద్దిన్, సుబాని, దుర్గయ్య, కాంతారావు, వెంకటయ్య, శ్రీహరి, హనుమంత పాల్గొన్నారు.

చింతపల్లి: రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందుబాటులో ఉంచాలని సీపీఎం మండల కార్యదర్శి ఉడుకుంట్ల రాములు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ యూరియా సక్రమంగా అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయానికి ప్రభుత్వం విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యతతో కూడిన విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

● చింతపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రంలో యూరియను ఏవో శ్రావణకుమారి ఆధ్వర్యంలో రైతులకు సరఫరా చేశారు. కార్యక్రమంలో పూల వెంకటయ్య, ఉజ్జిని సంతోష్‌రావు, కోట్ల దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ రూరల్, మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యో తి): మిర్యాలగూడకు చెందిన బంటు వెంకటేశ్వర్లు సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా గాజులరామారంలో ఇటీవల నిర్వహించిన సీపీఐ రాష్ట్ర మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణానికి చెందిన బంటు వెంకటేశ్వర్లు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తనను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్న నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

గణేష్ ఉత్సవాలను అప్రమత్తంగా నిర్వహించాలి

చందంపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాలను నిర్వహించే నిర్వాహకులు ఉత్సవాలను అప్రమత్తంగా నిర్వహించాలని డిండి సీఐ బీసన్న కోరారు. మండలం పోలేపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతులు తీసుకొని నిబంధనలు పాటించాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని నిర్వాహకులను కోరారు. సమావేశంలో ఎస్ఐ లోకేష్, చందంపేట, నేరేడుగొమ్ము ఉమ్మడి మం డలాల గణేష్ ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

పోరాటాల్లో భాగస్వామ్యమే నివాళి

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎర్రజెండా చేస్తున్న పోరాటాల్లో భాగస్వామ్యమే అమరవీరులకు ఇచ్చే గొప్ప నివాళి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఐలాపురం గ్రామానికి చెందిన గన్యానాయక్ సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల హక్కుల కోసం, సమానత్వ సమాజం కోసం గన్యానాయక్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, పగిడోజు రామ్మూర్తి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ పోరాటం

పెద్దవూర, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్‌ఎఫ్ విద్యారంగ సమస్యలపై పోరాడుతుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కోరారు. కార్యక్రమంలో శశికుమార్, మురళి, సంతోష్, పవన్, మధు, గణేష్, అంజి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత

మిర్యాలగూడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత ఏర్పడిందని టీడీపీ మండల అధ్యక్షుడు చిలకల వెంకన్నయాదవ్ ఆరోపించారు. మండలంలోని అలగడపలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ కేంద్రంలో యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే చెప్పులు క్యూలో పెట్టి వేచి చూడాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, రైతులందరికీ యూరియా సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలి

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బీపీ మండల్ జయంతి సందర్భంగా అమరవీరుల పార్కులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా ఓబీసీల సమస్యలను గుర్తించిన మండల్, పరిష్కారానికి 27 సిఫార్సులు చేసినట్లు తెలిపారు. ఆయన చేసిన సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాలలో సోషల్ వర్కర్ డాక్టర్ రాజు, ఉపాధ్యాయ సంఘ నేతలు బాలాజీనాయక్, పరమేష్, ప్రభాకర్, బీసీ సంఘాల నేతలు మారం శ్రీనివాస్, మురళీయాదవ్, గోపినాయక్, విష్ణు, వీరశేఖర్, యుగంధర్, నాగరాజు, భగవాన్, సోమలింగం పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి


దేవరకొండ ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రేషన్‌డీలర్లు

పెద్దఅడిశర్లపల్లి, చింతపల్లి, పెద్దవూర, నేరేడుగొమ్ము, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల రేషన్ డీలర్ల కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం రేషన్‌డీలర్లు ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ రేషన్ డీలర్ల కమిషన్ ఇవ్వకపోవడంతో రేషన్ డీలర్ల కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులతో చర్చలు జరిపి కమీషన్ వచ్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఏప్రిల్, మేతో పాటు జూన్, జూలై, ఆగస్టు నెలలకు ఒకేసారి పే దలకు రేషన్ బియ్యాన్ని ఉదయం 7 నుంచి రాత్రి 10గంటల వరకు పారదర్శకంగా అందించామని తెలిపారు. ఏ నెలా కమీషన్ ఆ నెల రేషన్ డీలర్ల ఖాతాల్లో జమ చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కమీషన్ అందించి ఆదుకోవాలన్నారు.


పీఏపల్లి: తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

● పీఏపల్లి తహసీల్దార్ జయశ్రీకి పీఏపల్లి, గుడిపల్లి మండల రేషన్ డీలర్లు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు రమావత్ శ్రీనునాయక్, కార్యదర్శి ఈదయ్య, కోశాధికారి వెంకటమ్మ,కుర్మాల శ్రీను, మైలు వెంకట్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, సుజాత, రజిత, జయలాల్,హతీరాం తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లిలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మకు రేషన్ డీలర్లు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు పంబలి, కార్యదర్శి దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి బొడ్డు యాదగిరి, డీలర్లు నారాయణ, సాయిబాబ, అశోక్‌రెడ్డి, నాగమణి, గోవర్ధన్, వెంకటయ్య, నరసింహరావు, కేశ్యానాయక్, పద్మ, రోజా తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవూరలో మండల రేషన్‌డీలర్లు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సీ హెచ్.వెంకటేశ్వర్లు, డీలర్లు వంశీకృష్ణ, రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

● నేరేడుగొమ్ములో డీలర్ల సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు కొర్ర శంకర్‌నాయక్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల 5 నెలల కమీషన్లు విడుదల చేయాలని కోరారు. నేరేడుగొమ్ము తహసీల్దార్ ఉమాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు లోకసాని నరేందర్, మేరెడ్డి అమృతారెడ్డి, డీలర్లు కొర్ర దేవ, గుర్రం విజయలక్ష్మి, రామచంద్రం, సురేష్, విజయ్‌కుమార్, పాండు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.